# మన్మధబాణాలు

పదిమంది సహాయంతో ప్రారంభమై రాను రాను నేర్పరితనం పెరిగినకొద్దీ ఒకడే నిర్వహించే స్థితికి ఎదగడం కూడా ఒక క్రమమే. ఆల్ ఇన్ వన్ అనేది పరిణామానికి తుదిమెట్టు కదా!

వేశ్యావాటికలో తిరిగితిరిగిఎట్టకేలకు బయటపడి మన విటస్వామి నగరంలోకి పునఃప్రవేశం చేస్తాడు. అప్పుడుకూడా ఇతని దృష్టి అట్టడుగువర్గం వారి మీద ఉంటుంది. నగరవర్ణనలో దొమ్మరి ఆటలు, కొమ్మదాసర్లు కోడిపందేలు, పొట్టేలు పోటీలు, కుస్తీపట్లు ఈనరుకు నంతా వర్ణిస్తాడు. ఆనాటి సంఘమూ దాని అలవాట్లూ ఆచారాలూ ఇందులో బాగా కనిపిస్తాయి.

కామవిలాసం, మదన విలాసం శృంగారమంజరి, శృంగారశేఖరం ఇలా ఈ భాణాలపేర్లుకూడా మ యాళసినిమాల్లాగా ఉంటాయి. ఇంతకీ మన్మథ భాణాలు అంటే ఇప్పటికి తెలిసినట్టేగా!

శృంగారనది ఏదయినా ఒకటిఉంటే దాని సుడిగుండం వంటిదట వేశ్యవాటిక. బ్రహ్మచారులు మొదలు కొని సన్యాసుల వరకూ అందరినీ ఇది ఒడిసిపెట్టి తనలోకి గుంజేసుకుంటుందట. మన్మథోపనిషత్తుల్ని ఇక్కడ ఉపదేశిస్తారట. మన్మథ బ్రహ్మవిద్యను అభ్యసించడానికి వేశ్యవాటిక ఒక యోగసిద్ధి తీర్థమట.

కామవ్రత సిద్ధికోరిన యువకులు తమ తల్లితండ్రుల మాటల్ని పెడచెవిని పెట్టి, ఇళ్ళూ వాకిళ్ళూవదిలి వచ్చేసి ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్నారట. చదువులూ_ఉద్యోగాల్నూ వ్యాపారాలూ_ సంసారాలూ అన్నీ వదిలేసి రేయింబవళ్ళు ఈ వీధిలోనే తారట్లాడుతున్నారుట.

ఈ శృంగారం సుడిగుండంలోతెల్లవారడం ఎలాఉంది! ఏమేమి దృశ్యాలు కనిపిస్తున్నాయో రన్నింగ్ కామెంటరీ ఇస్తున్నాడు.

ఆద్యాప్యనంగ మనయన్తి రతాంత
తాంతాః
కాంతాన్సతోషమురసైవ విటా
వహన్తః
వాంఛావిహృత్యపటహా వటవస్తు
కేచిత్
సంవ్యాన సంవృత ముఖాః
సభయం క్రమన్తే॥

తెల్లవారిపోయినా తెమిలి ఇవతలికి రాలేకపోతున్నారు కొందరు విటులు. బరితెగించిన బాపతుగాళ్ళు. వీళ్ళు ఎవరికీ భయపడరు. సిగ్గులజ్జ వదిలేశారు. పడకటింటి కిటికీలు తెరుచుకునే కథ నడుపుతున్నారుట. చుట్టుపక్కల అన్నీ ఆ కొంపలే అయినప్పుడు ఇక అభ్యంతరం ఏముంది!

రతికార్యంలో అలిసిపోయి గుండెల మీదకి వాలిపోయిన వేశ్యలని వదిలిపెట్టకుండా ఆనందంగా అదిమి పట్టుకుంటున్నారుట ఈ దేశముదురుగాళ్ళు.


అలిసిపోయి వాలిపోతున్నది విటులు కాదు వేశ్యలు. అంటే డామిట్ కథ తారుమారయ్యిందన్నమాట! ఆడదే మొగవాడయితే అహో! ఆనందపుటంచులు చూస్తాం!

పైగా ఇది తెల్లవారుజామునే కనిపించిన దృశ్యం. ఇంకా ఈ జంటకి తనివితీరలేదు. ముక్కోటి, మహాశివరాత్రి వంటి పర్వదినాలకి అర్థరాత్రి ఆటలు పట్లవాసం వారికి కొత్తకాదు. ఇదెక్కడిది_ఎర్లీఇన్‌ది మోర్నింగ్.

కొనుక్కున్న వస్తువుకి కొసరు అడగడం పరిపాటి. అసలుకన్నా కొసరుకే రుచిఎక్కువ.

కొసరి కొసరి ఈ జంట ఇలా సోలిపోతే మరోదృశ్యం హడావిడిగా వెళ్ళిపోతున్న బ్రహ్మచారులు.

వీళ్ళు ఆలస్యంగా వస్తారు. పెందరాళే వెళ్ళిపోతారు. అందుకే వేశ్యలకి వీళ్ళమీద మోజు ఎక్కువట! ఊరంతా సద్దుమణిగాక అర్ధరాత్రి చీకటి చాటున నక్కుతూ నక్కుతూ ఈ వీధికివస్తారు. వీళ్ళు ఇక్కడికి వచ్చాక కూడా ఇంకా భయమే వీళ్ళకి ఎవడుచూస్తాడో అని. బారులోకి వచ్చేశాక మేష్టారు కనిపించినా మరేమీ ఫరవాలేదు అనే ధైర్యం ఉండదు వీళ్ళకి. దొడ్డి గుమ్మాన దూరతారట! కోడికుయ్యకముందే లేచి ఎవరి కంటపడకుండావెళ్ళిపోతారుట! అలాంటి బ్రహ్మచారుల్ని పట్టుకున్నాడు మనలీలావసంతుడు



కోరికల్ని తీర్చుకోవడంలో అంతగా నేర్పరులుకాని వటువులు కందువాతో ముఖంకప్పుకుని గబగబానడిచిపోతున్నారుట.

మరికాసేపు ఉండాలనీ, కొసరు ముద్దులు అందుకోవాలనీ ఎంతగా మనసు పీకుతున్నా లోకానికి దడిసి, ఎవరికైనా తెలిస్తే పిల్లనివ్వరేమోరా భగవంతుడా?_అని వీళ్ళువారకుండానే వెళ్ళిపోతున్నారు.

సీనియర్ మోస్టుల్ని జూనియర్ మోస్టుల్ని ఒకే శ్లోకంలో కుదిగుచ్చాడు ఈ కవి. నేటి వటుడే రేపటి విటుడు.

— జీయార్